క్లుప్తంగా

హైకోర్టు తీర్పుపై హర్షం



ఎల్లారెడ్డి: ముదిరాజ్ సంఘానికి అనుకూలంగా హైకోర్టు తీర్పు ఇవ్వడంపై ముదిరాజ్ సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గురువారం ఎల్లారెడ్డిలో నిర్వహించిన సమావేశంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు విఠల్, మున్సిపల్ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ మాట్లాడుతూ గంగపుత్ర సంఘం సొసైటీల్లో ముదిరాజ్‌లకు సభ్యత్వం ఇవ్వడంలో ముదిరాజ్‌లకు మద్దతుగా హైకోర్టు తీర్పు ఇవ్వడం సంతోషకరమన్నారు. సొసైటీ చైర్మెన్ నర్సింలు, ముదిరాజ్ సంఘం నాయకులు ప్యాలాల రాములు, బాలకిషన్ తదితరులున్నారు.

శుద్ధ జలాల సరఫరాకు చర్యలు



సాక్షి ఎఫెక్ట్..

నిజాంసాగర్ (జుక్కల్): మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన శుద్ధ జలాలను సరఫరా చేస్తున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రమేశ్ పేర్కొన్నారు. కలుషిత నీరు సరఫరా శీర్షికతో గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. గాలీపూర్ గ్రామంలోని ఏడో వార్డులో భగీరథ పైపుల్లో చెత్త, మట్టి కారణంగా రంగుమారిన నీళ్లు వస్తున్నాయన్నారు. ఆ పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ స్వర్ణలత, జీపీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : ఉపాధి కూలీలు కనీసం ప్రతి రోజు 6 నుంచి 8 గంటలు పని చేస్తే పూర్తి కూలి వస్తుందని ఎంపీవో రాము అన్నారు. గురువారం మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో ఉపాధిహామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. కొలతలలో తేడా లేకుండా కొలవాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట ఉపాధి హామీ సిబ్బంది ఉన్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవం

కామారెడ్డి టౌన్ : సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం సీఐటీయూ, తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, జిల్లా గ్రంథాలయం ముందు జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కందారపు రాజనర్సు, నాయకులు ప్రభాకర్, ఎండీ. మహబూబ్ అలీ, దీపక్ తదితరులున్నారు.

స్కూళ్లలో పనుల పరిశీలన



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా కొనసాగుతున్న పనులను కాంప్లెక్స్ హెచ్‌ఎం శౌకత్‌అలీ గురువారం పరిశీలించారు. జూన్ 10వ తేదీ వరకు పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కార్యదర్శి శ్రావన్, ఏఈ, సీసీ మేహర్ తదితరులు ఉన్నారు.

రాజంపేటలో..

రాజంపేట : రాజంపేట మండలం కొండాపూర్ క్లస్టర్ పరిధిలోని గుడి తండా జీపీ పోల్టిమీర్ గడ్డ తండాలో ప్రాథమిక పాఠశాల అమ్మ ఆదర్శ పాఠశాలలో భాగంగా పనులను కొనసాగుతున్నట్లు మండల సమైఖ్య కోశాధికారి కే లావణ్య, గ్రామ సంఘం అధ్యక్షులు మౌనిక స్కూల్ హెచ్‌ఎం లావణ్య, సీసీ భాగయ్య తెలిపారు.

నృసింహస్వామికి పట్టువస్త్రాల సమర్పణ



మాచారెడ్డి : మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నృసింహస్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఆలయ అర్చక దంపతులు పరంధామాచార్యులు దంపతులు స్వామి వారికి పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించారు. ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ కమలాకర్ రెడ్డి, ఈవో శ్రీధర్ రావు, సిబ్బంది సంతోష్ కుమార్, లక్ష్మణ్ ఉన్నారు.

సాగుపై కొరవడిన అవగాహన

- రైతు వేదికల్లో తూతూమంత్రంగా సదస్సులు
- పత్తాలేని వ్యవసాయ అధికారులు



బిచ్కుందలో పొలం పనులు చేస్తున్న రైతు

బిచ్కుంద(జుక్కల్) : వానాకాలం సాగు మొదలుకాగా రైతులు ఇప్పటికే తమ భూములను దుక్కులు దున్ని తొలకరి కోసం ఎదురుచూస్తున్నారు. ఇలాంటి తరుణంలో పంటల సాగుపై రైతన్నలకు సలహాలు, సూచనలు కరువయ్యాయి. రైతు చైతన్య యాత్రలు నాలుగైదేళ్ల నుంచి నిర్వహించకపోవడంతో జుక్కల్ నియోజకవర్గంలో సాగుపై అన్నదాతలకు అవగాహన కొరవడింది. నకిలీ విత్తనాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భూసార పరీక్షలు, పంటల మార్పిడితో అధిక దిగుబడులు, వాతావరణ మార్పులబట్టి ఏయే పంటలు వేయాలనే వాటిపై అవగాహన కల్పించకపోవడంతో క్షేత్రస్థాయిలో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. వ్యవసాయ అధికారులు ఆ దిశగా అడుగులు వేయడం లేదు. బిచ్కుంద మండలంలో అధికారులు రైతు వేదికల్లో సమావేశాలు నిర్వహించినట్లు చెబుతున్నా అవి ఆచరణలో మాత్రం అలసత్వం కనిపిస్తోంది. బిచ్కుందలో ఏడీఏ లేకపోవడంతో సీనియర్ పిట్లం ఏవోను ఏడీఏగా ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారు. ఎప్పుడు వస్తారో తెలియని పరిస్థితి ఉంది. సలహాలు, సూచనల కోసం రైతులు బిచ్కుంద ఏవో కార్యాలయానికి వెళ్లిన అధికారులు ఏనాడు అందుబాటులో ఉండరు. ఏఈవోకు ఒకొక్కరికి రెండు, మూడు గ్రామాలు ఇవ్వడంతో ఏ రోజు ఏ గ్రామంలో ఉంటారో తెలియని పరిస్థితి ఉంది. ప్రస్తుతం రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

అవగాహన కల్పిస్తే లాభం

బిచ్కుంద, జుక్కల్, మద్నూర్, పెద్దకొడప్‌గల్, పిట్లం మండలాల్లో 60శాతం మంది రైతులు సోయా సాగు, 30 శాతం మంది రైతులు కంది పంట మిగితా వారు పత్తి, పెసర, మినుము ఇతర పంటలను సాగు చేస్తారు. రైతులకు క్షేత్రస్థాయిలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, అవగాహన ఉన్న సామాజిక రైతు సంఘాలు రైతులకు అవగాహన కల్పించకపోవడంతో గత 30 ఏళ్ల నుంచి రైతులు భూమిలో ప్రతిఏటా ఒకే పంట సోయా, కంది, పత్తి, వరి పంటలు సాగు చేస్తున్నారు. చీడపీడలు ఆశించి దిగుబడి రాక నష్టాలపాలై ఆర్థికంగా ఎదగలేకపోతున్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి భూసార పరీక్షల ఆవశ్యకత, పంటల మార్పిడి, చీడపీడల నివారణ, విత్తన శుద్ధి, సేంద్రియ ఎరువుల వాడకం అవగాహన కల్పించాల్సి అవసరం ఉంది. అలాగే వ్యవసాయంలో నష్టపోయినప్పుడు పాడి పశువుల ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించడం, పశుసంవర్ధక శాఖ అందిస్తున్న రాయితీలు, విత్తనోత్పత్తికి సంబంధించిన విషయాలపై అవగాహన కల్పిస్తే బాగుంటుందని రైతులు కోరుతున్నారు.

ఇష్టారాజ్యంగా సిబ్బంది హాజరు



ఎంపీడీవో కార్యాలయంలో ఉదయం 11.28 గంటలకు ఖాళీగా ఉన్న ఎంపీడీవో కుర్చీ

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సిబ్బంది సమయపాలన పాటించట్లేదని కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉదయం 10.30కి విధులకు హాజరు అవ్వాల్సి ఉండగా 11.28-12గం వరకు కార్యాలయానికి వస్తూనే ఉన్నారని వారంటున్నారు. దీనిపై వారిని వివరణ కోరితే ఫీల్డ్ వర్క్ అంటూ సమాధానం ఇస్తున్నారని వాపోతున్నారు. దీంతో గంటలు గంటలు తాము కార్యాలయంలో వేచి ఉండాల్సి వస్తోందని వారంటున్నారు. కార్యాలయంలో ఉన్నాధికారులు సైతం ఆలస్యంగా రావడంతో కిందిస్థాయి సిబ్బంది కూడా అలాగే వస్తున్నారని వారు పేర్కొంటున్నారు. కార్యాలయంలో ఎంపీడీవోతో సహా పదిమందికి పైగా సిబ్బంది ఉండగా ఒకరిద్దరు మాత్రమే సమయానికి వస్తున్నారని పలువురు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని కార్యాలయ సిబ్బంది సమయానికి విధులకు హాజరయ్యేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సిద్దరామేశ్వరాలయానికి కుర్చీల అందజేత



దాతను సన్మానిస్తున్న ఆలయ నిర్వాహకులు

భిక్కనూరు : భిక్కనూరు సిద్దరామేశ్వరాలయంలోని అన్నప్రసాద వితరణ కార్యక్రమానికి రూ. 69 వేల విలువగల టేబుళ్లను కుర్చీలను మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ పురాం రాజమౌళిగుప్తా గురువారం అందజేశారు. ఆరు స్టీల్ టేబుళ్లతో పాటు 24 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పునర్నిర్మాణ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో దాత పురాం రాజమౌళిగుప్తాను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ అందే మహేందర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ టీపీ లింబాద్రి, ప్రతినిధులు బల్యాల సుదర్శన్, అందే దయాకర్‌రెడ్డి, నర్సింహా రెడ్డి, యాదిరెడ్డి, మైపాల్ రెడ్డి, నీల అంజయ్య, కల్లూరి సిద్దరాములు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని శాంతినగర్ కాలనీలో సీసీ రోడ్డు పనులను గురువారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 25 లక్షల ఎస్‌ఆర్‌జీఈజీఎస్ నిధులతో ఈ సీసీ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జంబిగే హన్మాండ్లు, నాయకులు అడ్వకేట్ రాంరెడ్డి, మోహన్ రెడ్డి, శివ, అశోక్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

మిత్రులకు ఆసరాగా..



రాజంపేట : తలమడ్ల పాఠశాల 2005-06కు చెందిన మిత్రులు తమ తోటి మిత్రులు ఇబ్బందుల్లో ఉన్నారని సమాచారం అందడంతో గురువారం తలమడ్ల గ్రామానికి చెందిన అవుసుల రవికి మూడు చక్రాల సైకిల్‌ను, శివాయిపల్లి గ్రామానికి చెందిన కంకణాల స్వప్నకు రూ. 10 వేల ఆర్థికసాయం చేశారు. కంకణాల మొగులయ్య, సాయిబాబా, జయగిరి లక్ష్మణ్‌రావు, తమ్మల స్వామి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అందుబాటులో ఉంచాలి



సమీక్ష నిర్వహిస్తున్న ఎంపీపీ గరీబున్నిసాబేగం

లింగంపేట(ఎల్లారెడ్డి): ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలని మండల పరిషత్ అధ్యక్షురాలు గరీబున్నిసాబేగం సూచించారు. గురువారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ గరీబున్నిసాబేగం అధ్యక్షతన ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయా శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. రైతులు విత్తనాలు కొంటే రసీదులు తీసుకోవాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై విద్యాధికారితో మాట్లాడారు. జూన్ 10వ తేదీ వరకు పనులు పూర్తి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అలాగే పంచాయితీ రాజ్ శాఖ పొల్కంపేట, సజ్జన్‌పల్లి మధ్య పెద్దవాగుపై నిర్మిస్తున్న వంతెన పనులు వేగంగా నడుస్తున్నట్లు ఏఈ రాకేష్ వివరించారు. పొల్కంపేట చౌదరి చెరువు మరమ్మత్తుల కోసం రూ. 30 లక్షలు నిధులు మంజూరైనట్లు నీటిపారుదల శాఖ ఏఈ అరుణప్రభ పేర్కొన్నారు. చేపల పెంపకంపై మహిళలు ఆసక్తి చూపిస్తే యునిట్లకు రుణాలు ఇప్పిస్తామని ఏపీఎం శ్రీనివాస్ తెలిపారు. లింగంపేట బస్టాండ్ నిర్వహణతీరుపై ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బస్సులు సమయపాలన పాటించకపోవడంపై ఆర్టీసీ అధికారులను నిలదీశారు. సమావేశంలో వైస్ఎంపీపీ విఠల్‌రెడ్డి, పర్యవేక్షకుడు పవన్, ఎంపివో అబ్బాగౌడ్, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థుల కోసం యూనిఫాంల తయారీ



యూనిఫాంల కోసం విద్యార్థుల కొలతలు తీసుకుంటున్న సిబ్బంది

రాజంపేట : గ్రామ సంఘాల ఆధ్వర్యంలో విద్యార్థులకు యూనిఫాం తయారీ చేపడుతున్నట్లు డీపీఎం రమేశ్ బాబు అన్నారు. రాజంపేట మండల సమాఖ్య పరిధిలోని అన్ని గ్రామాల్లో విద్యార్థులకు సంబంధించిన స్కూల్ యూనిఫామ్స్ కుట్టించాలని గ్రామ సంఘాలను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. మొత్తం 3,172 యూనిఫాంలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. జూన్ 10వ తేదీ లోగా సంబంధిత పాఠశాలలో అప్పగించేలా పనిచేస్తున్నామన్నారు. ఏపీఎం సాయిలు, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

రేపు పుస్తకాల ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్ : తెలంగాణ రచయితల వేదిక (తెరవే) ఆధ్వర్యంలో జూన్ 1న శనివారం సాయంత్రం 5గంటలకు స్థానిక కర్షక్ బీఎడ్ కళాశాలలో 'యుద్ధ గీతాలు' 'కవన సమీరాలు' పుస్తకాల ఆవిష్కరణ సభ నిర్వహించనున్నట్లు తెరవే జిల్లా అధ్యక్షుడు సిరిసిల్లా గఫూర్ శిక్షక్ తెలిపారు.

ఎల్‌వోసీ అందజేత



దోమకొండ : దోమకొండ మండల ముత్యంపేట గ్రామానికి చేందిన భూదేవి అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె చికిత్స నిమిత్తం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ రూ. 2,10,000 ఎల్‌వోసీ అందజేశారు. స్థానిక కాంగ్రెస్ నాయకులు సమాచారం ఇవ్వడంతో ఆయన స్పందించి ఎల్‌వోసీ అందజేశారు.

కోఆప్షన్ మెంబర్‌కు సన్మానం



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల పరిషత్ కార్యాలయం కోఆప్షన్ మెంబర్‌గా నూతనంగా ఎంపికైన బాబుమియాను గురువారం కాంగ్రెస్ పార్టీనాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రాంరెడ్డి, రాజు, షౌకత్‌అలీ లక్ష్మన్, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

అధ్యక్ష అభ్యర్థికి మద్దతు తెలపాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పోటీ చేయనున్న కంచర్ల బాలకిషన్‌కు వైశ్య సంఘం సభ్యులందరు మద్దతు తెలిపాలని మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ముత్యపు సుదర్శన్ అన్నారు. గురువారం ఎల్లారెడ్డి వైశ్యభవన్‌లో నిర్వహించిన వైశ్యసంఘం సభ్యుల సమావేశంలో మాట్లాడుతూ 2024-2026కు గాను ఎల్లారెడ్డి రెవెన్యూ డివిజన్‌కు జిల్లా అధ్యక్ష పదవిని రిజర్వ్ చేశారన్నారు. ఎల్లారెడ్డికి చెందిన వ్యాపారవేత్త కంచర్ల బాలకిషన్‌కు వైశ్యసంఘం సభ్యులు మద్దతు తెలిపి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైశ్యసంఘం నాయకులు ముత్యపు వీరేశలింగం, కంచర్ల బాలకిషన్, డాక్టర్ మారుతి, కృష్ణమూర్తి, కోశాధికారి సంతోష్, సుధాకర్ తదితరులున్నారు.

యోగాలో ఉచిత శిక్షణ

కామారెడ్డి అర్బన్ : పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో 1వ తేదీ నుంచి 11 రోజుల శంకు ప్రక్షాళన అడ్వాన్స్ యోగా ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు జగిత్యాలకు చెందిన యోగా, ఆధ్యాత్మిక పరిశోధన ప్రచార సేవా సంస్థ శ్రీకృష్ణ అష్టాంగ యోగా నిర్వాహకులు కళింగరాజు తెలిపారు. జూన్ 1న శనివారం సాయంత్రం 6 గంటలకు సిరిసిల్లా రోడ్డు శ్రీకృష్ణ గీతా మందిర్‌లో, జూన్ 2 ఆదివారం 10-30 గంటలకు విద్యానగర్ సాయిబాబా ఆలయంలో, అదే రోజు సాయంత్రం 6 గంటలకు శ్రీసరస్వతి శిశుమందిర్ హైస్కూల్‌లో పరిచయ కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు కళింగరాజు పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ సమావేశం

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : తాడ్వాయి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాజిద్‌అలీ తెలిపారు. 2022-2023లో ఖర్చుల వివరాలు వివరిస్తామన్నారు.

అధ్వానంగా పంట కాల్వలు



పంట కాలువలో పిచ్చిమొక్కలు

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : వర్షాకాలం పంటల పనులు ప్రారంభమయ్యాయి. అయితే పంటలకు నీరు అందించడానికి నిజాంసాగర్ నీటి విడుదల జరగడానికి రోజులు దగ్గర పడ్డాయి. కాని అధికారులు నిర్లక్ష్యం కారణంగా చివరి వరకు నీరందేలా లేదని రైతులు వాపోతున్నారు. అంకోల్ తండా, సంగం,అంకోల్ గ్రామాల పరిధిలో ఉన్న నిజాంసాగర్ పంట కాలువ పూర్తిగా మొక్కలతో నిండి పోయింది. ఎక్కడికి అక్కడ మట్టి పేరుకుని నీరు పారకుండా మారింది. రూ. లక్షలు ఖర్చు పెట్టి సీసీ కాలువ నిర్మించినా దానిని కాపాడాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పంట కాలువల పూడికతీత కోసం ప్రతిఏడాది నిధులు వస్తున్నా వాటిని ఎక్కడ వినియోగిస్తున్నారో అంటూ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంగం గ్రామ పరిధిలో గల నిజాంసాగర్ ఉపకాలువకు ఉన్న పంటకాలువను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

మైలారం జీపీ ఆస్తుల పరిశీలన



నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారంలో గురువారం జీపీ ఆస్తులను డీఎల్‌పీవో నాగరాజు పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన పల్లెప్రకృతి వనం, కంపోస్ట్ షెడ్డు, వైకుంఠ ధామం, నర్సరీలను పరిశీలన చేశారు. ప్రతిమొక్కను కాపాడాలని, ప్రతిరోజు ఇంటింటి చెత్తను సేకరించి తడి, పొడి చెత్తను వేరు చేయాలన్నారు. కంపోస్ట్ ఎరువును తయారు చేయాలన్నారు. జీపీ కార్యదర్శి సవిత ఉన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మానసిక ఆరోగ్యం సరిగ్గా లేక చాలామంది ఇబ్బంది పడుతున్నారని దానికి కౌన్సెలింగ్, ప్రత్యేక చికిత్స ద్వారా నయం చేయవచ్చని మానసిక వైద్యనిపుణుడు రమణ పేర్కొన్నారు. తాడ్వాయిలోని ఎర్రాపహాడ్ పీహెచ్‌సీలో గురువారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఈ కార్యకరమంలో ఆరోగ్య సామాజిక కార్యకర్త రాహుల్‌కుమార్, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది స్వాతి తదితరులున్నారు.

విత్తనాల కొనుగోలుపై అవగాహన



గాంధారిలో అవగాహన కల్పిస్తున్న ఏవో నరేశ్



పెద్ద తడ్గూర్‌లో మాట్లాడుతున్న ఏఈవో

గాంధారి(ఎల్లారెడ్డి) : మండల పరిధిలోని పలు గ్రామాల్లో గురువారం పర్యటించి రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించినట్లు ఏవో నరేశ్ తెలిపారు. వంద్రికల్, గౌరారం, కరక్‌వాడి, చద్మల్ గ్రామాల్లో పర్యటించి ఆయా గ్రామాల్లో రైతులతో సమావేశం ఏర్పాటు చేసి అవగాహన కల్పించినట్లు తెలిపారు. ప్రతి రైతు లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే విత్తనాలు కొనుగోలు చేయాలని తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని అవగాహన కల్పించామన్నారు. నిబంధనలు ఉల్లంగించిన డీలర్లు, వ్యాపారులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట ఈఏఈవోలు విఘ్నేష్, దీక్షిత్, కరుణేశ్వర్, ఆరతి ఉన్నారు.

విత్తనాలు తీసుకుంటే రసీదు తీసుకోవాలి

మద్నూర్(జుక్కల్) : రైతులు విత్తనాలు తీసుకునే సమయంలో దుకాణంలో తప్పకుండా రసీదు తీసుకోవాలని వ్యవసాయ విస్తరణ అధికారి చిద్రావార్ సతీష్ సూచించారు. మండలంలోని పెద్ద తడ్గూర్‌లో గురువారం రైతులతో సమావేశం నిర్వహించారు. వచ్చే వానాకాలం పంటల సాగుపై ఆయన రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో రైతులు సంగ్రామ్, యాదవ్‌రావ్, హన్మాండ్లు తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బోనాల ఊరేగింపు



భిక్కనూరు : మండల కేంద్రంలో మాల సంఘం ఆధ్వర్యంలో బోనాల ఊరేగింపు కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఎస్సీ మాల సంఘం ఆధ్వర్యంలో మహిళలు ఇంటికి ఒకబోనం చొప్పున ర్యాలీ నిర్వహించి ముత్యాలమ్మకు, నల్ల పోచమ్మకు బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా పోతరాజుల విన్యాసాలు యువకుల నృత్యాలు పలువురిని ఆకట్టుకున్నాయి.

సంక్షిప్తం

ఆలయ పూజారి మృతి



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ లక్ష్మీ వేంకటేశ్వరాలయం పూజారి రంగాచారి (59) గురువారం మృతి చెందాడు. ఆయన కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. రంగాచారి వేకువజామున తన ఇంట్లోనే మృతి చెందారు. మృతునికి భార్య వసుంధర ఇద్దరు కుమారులున్నారు. గురువారం మధ్యాహ్నం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి.

నేడు ఇంటర్ స్పాట్ అడ్మిషన్స్

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో నేడు ఇంటర్ విద్యార్థులు స్పాట్ అడ్మిషన్స్ జరగనున్నాయని ప్రిన్సిపాల్ ప్రవీణ్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 10గంటలకు ఇంటర్ ఫస్టియర్ విద్యార్థులకు సీఈసీ,హెచ్‌ఈసీ, ఏఅండ్‌టీ ఈ ఏడాది పదో తరగతి ఉత్తీర్ణులైన వారు తమ ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో నస్రుల్లాబాద్ పాఠశాలకు రావాలన్నారు.

జీలుగ విత్తనాల పంపిణీ



కామారెడ్డి రూరల్ : మండలంలో పచ్చిరొట్ట పంట అయినా జీలుగ విత్తనాలు పంపిణీ చేసామని కామారెడ్డి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు (ఏడీఏ) అపర్ణ తెలిపారు. మండలంలోని చిన్నమల్లారెడ్డి, ఇస్రోజీవాడి, శాబ్దిపూర్, క్యాసంపల్లి రైతు వేదికల్లో రైతులకు సరిపడా విత్తనాలను అందజేశామన్నారు. మండల వ్యవసాయ అధికారి ఎస్ శ్రీనివాసరావు, ఏఈవోలు అశోక్ రెడ్డి, రాణి తదితరులున్నారు.

రక్తదానం..



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకులు, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు గురువారం 73వ సారి రక్తదానం చేశారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఓ మహిళకు అత్యవసరంగా ఓ పాజిటివ్ రక్తం అవసరం కాగా బాలు రక్తదానం చేశారు.

రేపు దేవి విహార్ హనుమాన్ ఆలయ వార్షికోత్సవం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం దేవునిపల్లి దేవీ విహార్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా జూన్ 1న శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ఆధ్యాత్మిక, భక్తి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు రామానంద్, శివకుమార్, ప్రశాంత్‌లు తెలిపారు.